ముఖదర్శనం

ఇంటినిండా మనుషులు.

పెళ్ళికి వచ్చినట్లు వచ్చారు.

బంధు బలగం పెద్దది మరి.

ఇంట్లో ఇవతలి భాగంలో నేలమీద ఆడవాళ్ళూ, పిల్లలూ ఒకరినొకరు ఒరుసుకొని కూర్చున్నారు.

నాలుగు తరాలవాళ్ళున్నారు. పెద్దతరం, మధ్యతరంవాళ్ళు తమ జాతి తల రాతల్ని గురించి వాపోతున్నారు.

పిల్లలకు మరీ అయోమయంగా ఉంది. అమాయకమైన ఉల్లాసంతో ఇంట్లోకీ, బయటకూ తిరుగుతున్నారు - ఏదో చూద్దామని, మరేవో బాల్యచేష్టలు చేస్తూ.

అందరి మధ్యలో సావిత్రమ్మ ముఖం కనపడనీయకుండా చీరకొంగు కప్పుకుంది. పది రోజుల దుఃఖం గడ్డకట్టుకున్నా, ఆమె సన్నటి మూలుగు వినిపించీ వినిపించకుండా ఉంది.

'ఈ జేజి వేరు. ఈ సావిత్రమ్మ జేజి వేరు' అనుకుంది భార్గవి - సావిత్రమ్మ మనుమరాలు; పెద్ద కొడుకు చిన్న కూతురు; తొమ్మిదేళ్ళ పాప. పది రోజులుగా భార్గవి, సావిత్రమ్మ జేజిని చూస్తూనే ఉంది. ఎప్పుడూ ఏదో పనిలో, పలకరింపుల్లో, నవ్వుల్లో, కోపాల్లో, అదిలింపుల్లో కనిపిస్తూ ఉండి, పది రోజులుగా ముఖం కళదప్పిన జేజిని చూస్తూనే ఉంది. 'అబ్బ చచ్చిపోక ముందు జేజి వేరు, ఈ జేజి వేరు...' భార్గవి పసి బుర్రకు దిక్కుతోచకుండా ఉంది.

ఇంట్లో అవతలి రెండు భాగాల్లో, ఇంటి ముందు వసారాలో మంచాల మీదా, కుర్చీల్లోనూ మగవాళ్ళు కూర్చున్నారు.

జగిలి మీదా, నడవలోనూ, అవతలి మరొక భాగంలో గాటిపాటకు ఎదురుగా నడవలోనూ, సావిత్రమ్మ భర్త రామిరెడ్డి దాయాదులైన మగవాళ్ళు వాళ్ళు; వసారాలో రామిరెడ్డికి వరసైన మగవాళ్ళు ఒకరినొకరు పలకరించుకుంటున్నారు.

పరస్పరం యోగక్షేమాలు కనుక్కుంటున్నారు.

వానలు, పంటలు, పంటలకు పట్టిన తెగుళ్ళు, పడిపోయిన పంటల ధరలు, గ్రామ పార్టీలు, జన్మభూమి, స్థానిక రాజకీయాలు – అన్నీ మగవాళ్ళ మాటల్లో దొర్లిపోతున్నాయి.

కొందరుమాత్రం చనిపోయిన తమ బంధువు రామిరెడ్డిని గురించీ, వాళ్ళ కుటుంబ స్థితిగతుల గురించీ గొంతులు తగ్గించి మాట్లాడుకుంటున్నారు.

భార్గవి మనసు ఇవేవీ అందనంత దూరంలో ఉంది.

'ఈ రోజు అబ్బ దివసం.

చిన్న దివసం, పెద్ద దివసం అంటారు.

ఈ పొద్దు దివసం.

అసలు దివసం అంటే ఏందో?

జేజిని ఏం చేస్తారో?

జేజి మాట్లాడడం లేదు.

అమ్మ, గాయత్రి పెద్దమ్మ, పార్వతమ్మ చిన్నమ్మ, రాజేశ్వరత్త, సరస్వతత్త, లక్ష్మి అత్త, వెంకటమ్మ అవ్వ, సుబ్బయ్య జేజి – అందరూ వచ్చినారు.

జేజిని చూడగానే కన్నీళ్ళు పెట్టుకున్నారు. కళ్ళు తుడుచుకుంటూ కూర్చున్నారు. అత్తలు, అవ్వ, జేజి చేతుల మీద చేతులు వేసి జేజి పక్కనే కూర్చున్నారు.

అందరూ మాట్లాడుతున్నట్లే ఉంటుంది.

ఏదీ సరిగ్గా తెలియదు.

అమ్మ మంచి బట్టలు కట్టుకోనీలేదు.

బయట ఊర్ల నుంచి వచ్చిన చుట్టాలు మంచి బట్టలు కట్టుకొని వచ్చినారే?'

తల్లిని అంటిపెట్టుకుని కూర్చున్న భార్గవికి అక్కడి దృశ్యాలన్నీ గందరగోళంగా ఉన్నాయి.

"మీ ఆడవాళ్ళ పని ఇంక మొదలు పెట్టండ్రా. రావలసిన చుట్టాలంతా వచ్చినారు. బ్రామ్మణయ్య కూడా ఇప్పుడే వచ్చినాడు." ఇవతలి వైపునకు వచ్చి, ఎవరో ఒక పెద్దాయన చెప్పి, అవతల వైపునకు ఆదరాబాదరా వెళ్ళిపోయాడు.

అప్పటి వాతావరణంలో ఇవతలకీ, అవతలకీ మధ్య కనపడని సరిహద్దులేవో ఉన్నట్లుంది.

'ఆడవాళ్ళ పని ఏమిటి? ఏం మొదలు పెడతారో?' ప్రతిరోజూ ఇంట్లో, పండగల్లో, పబ్బాల్లో, తోటల్లో, పెళ్ళిళ్ళల్లో ఆడవాళ్ళ పని ఏదో భార్గవికి తెలుసు.

ఈ రోజు ఆడవాళ్ళ పనే తెలియదు.

ఇవతలింట్లోకి పిచ్చమ్మవ్వ వచ్చింది. డెబ్బయ్యేళ్ళ పైబడిన పండు వితంతువు. అంచులేని తెల్లచీరలో, రవికలేని గుండెల్ని పైటకొంగుతో కప్పుకొని వచ్చింది.

ఊళ్ళో ఎవరింట్లో ఏ కార్యం జరిగినా పిచ్చమ్మవ్వ సాయం కోరతారు.

పురుళ్ళకు తోడు వస్తుంది.

బాలింతలకు జాగ్రత్తలు చెబుతుంది.

సమర్త సంబరంలో ఎప్పుడెప్పుడు ఏది ఎట్లా చెయ్యాలో బోధిస్తుంది.

పెళ్ళి తంతులన్నీ ఏ వరుసలో, ఏ ప్రకారం సాగిపోవాలో చెప్పవలసిన వాళ్ళకు చెప్పి, దూరంగా వంటల దగ్గర అజమాయిషీకి వెళ్ళిపోతుంది. శుభకార్యాల్లో తనెంత దూరంలో ఉండాలో, అశుభకార్యాల్లో ఎంత దగ్గరగా ఉండాలో పిచ్చమ్మవ్వకు అనుభవం రక్తమైంది.

పద్దెనిమిదో ఏట, పసిది పాలు తాగే వయసులో ఉన్నప్పుడు పిచ్చమ్మ భర్త ఖూనీ అయిపోయాడు.

"బయట పనులన్నీ పూర్తి అయినాయగ్రా. సావిత్రమ్మ మొగుడికి ఇష్టమైనవన్నీ తయారైపోయినాయి. బయటనే లే. ఆచారం తప్పుతుందా? ఇంటి చాకలోళ్ళు కాచుకొని బయట్నే వీధిలో ఉండారు. సావిత్రమ్మకు స్నానం చెయ్యించాలా? సాంగ్యాలన్నీ పూర్తికావాలా? రేవుకు తీసుకపోవాలా? మన కర్మలన్నీ చానా చానా... తొందరగా బయలుదేరండి" పిచ్చమ్మ చెప్పింది.

"మొగోళ్ళ పనులు మొదలైనాయా?" ఎవరో అన్నారు.

"మొగోళ్ళ పనులు మొగోళ్ళవి. ఆడోళ్ళ పనులు ఆడోళ్ళవి. ఎవరి కర్మలు వాళ్ళవి" అంటూ పిచ్చమ్మ అందర్నీ లేవదీసింది.

అందరితో పాటూ తల్లి చెయ్యి పట్టుకొని భార్గవి లేచి నిలబడింది.

'రేవు అంటే ఏమిటో? ఆడవాళ్ళ పనులు ఇప్పుడేవో? కర్మలంటే ఏమిటో?' ఇవే భార్గవి మనసుకు అందలేదు. నలుగురైదుగురు సావిత్రమ్మను పొదివి పట్టుకొని వీధిలోకి నడిపించారు.

నట్టనడివీధిలో సావిత్రమ్మ చుట్టూ సాటి స్త్రీలు.

అంతటా వాళ్ళే. ఎదురిళ్ళ ముందరి అరుగుల మీదికి ఎక్కి కొందరు చూస్తున్నారు.

ఎదురిళ్ళ మిద్దెల మీద నుంచి కొందరు తొంగి చూస్తున్నారు.

చిన్న పిల్లలు తల్లుల్ని అంటగరచుకొని కళ్ళింతలు చేసుకొని చూస్తున్నారు.

భార్గవి తల్లి చేతిని వదలకుండా గట్టిగా పట్టుకుంది.

ఎత్తెత్తుగా ఉండే పెద్దవాళ్ళ మూలంగా భార్గవికి జరిగేది సరిగ్గా కనపడడం లేదు.

సావిత్రమ్మ తోడబుట్టినవాళ్ళూ, పుట్టింటి దాయాదులూ - అన్నలూ, తమ్ముళ్ళూ, చిన్నాయనలూ, పెదనాయనలూ వసారాలో నిలబడి చూస్తున్నారు.

"కొంచెం ప్రక్కకు తప్పుకోండర్రా. మీదిమీదికి తోసుకొని రావద్దు. ముందు స్నానం కావాల..." పిచ్చమ్మవ్వ, మరిద్దరు ముగ్గురు వితంతువులు, సావిత్రమ్మ చుట్టూ కొంచెం చోటును ఏర్పచగలిగారు. సావిత్రమ్మ ముసుగుతోటి తలను ఎత్తనేలేదు.

పిచ్చమ్మవ్వ ముసుగును తొలగించింది. ఆమె నిర్వికారంగా తల ఒగ్గింది. నేలకేసి తప్ప, చూపులు తిప్పలేదు.

నట్టనడివీధిలో...

సావిత్రమ్మ ముఖానికీ, చేతులకూ, పాదాలకూ పసుపు రాశారు.

అందరి చూపుల మధ్య సావిత్రమ్మకు తల స్నానం చేయించారు.

ఆమె పొడవాటి జుట్టు చెల్లాచెదరైంది. ముఖం మీద పడిన వెంట్రుకల్ని ఎవరో సరిచేశారు.

తల మీద నీళ్ళు ఓడుతూనే ఉన్నాయి.

తడిసిపోయిన రవిక ఒంటికి బిగుసుకపోయింది. రొమ్ములు నలువురికీ కనపడకుండా చీర కొంగును సావిత్రమ్మ చిన్నక్క పట్టుకుంది.

రవికను ఒకంతట విప్పుకోవడం సావిత్రమ్మకు సాధ్యం కాలేదు. పెద్దక్క సహాయంతో ఎలాగో సావిత్రమ్మ రవికను విప్పుకోగలిగింది.

పుట్టింటివాళ్ళు తెచ్చిన కొత్త రవికను తొడుక్కుంది.

తడిసి ముద్దయిపోయిన పాత చీరను విడిచి పుట్టింటివాళ్ళే తెచ్చిన కొత్త చీరను చుట్టుకుంది.

అంతసేపూ సావిత్రమ్మ సిగ్గుతో చచ్చిపోయింది. నిర్వేదం ముంచుకొచ్చింది.

పిచ్చమ్మలాంటి పండు వితంతువులూ, నిండు విధవలూ చెప్పినట్లే చేయసాగింది.

'ఇంట్లో జల్దారిలోనే ఈ పని చేసి ఉండవచ్చు. దరిద్రం. బయటే చెయ్యాలంట' అని సావిత్రమ్మ కూతుళ్ళు మనసులో అనుకున్నారు.

'ఏం ఆచారాలో, ఏం పాడో', అని ఒకరిద్దరు యువకులనుకున్నారు.

"గంధం పూయండి."

"కుంకుమ బొట్టు పెట్టండి."

"పూలు పెట్టండి."

"గాజులు తొడగండి."

"వక్కలాకులు చేతుల్లోబెట్టి నమస్కరించిపోండి."

"పుట్టింటి వాళ్ళు వడి బియ్యం తెచ్చినారా?"

"తెచ్చినారులే."

"ఒడిలో పొయ్యండి."

"పుట్టింటివాళ్ళు టెంకాయ దెచ్చినారా?"

"తెచ్చినారు."

"రండమ్మా రండి, ఒక్కొక్కర్రే..."

"అయినవాళ్ళందరూ రండి."

పండు వితంతువులూ, నిండు విధవలూ, పండు ముత్తయిదువులూ, నిండు ఇల్లాళ్ళూ ఎవరు, ఏది, ఎందుకు శాసిస్తున్నారో భార్గవికి తెలియకుండా ఉంది.

అమ్మతో పాటు ఎలాగో ముందుకొచ్చి సావిత్రమ్మ జేజిని భార్గవి చూడగలిగింది.

అయినవాళ్ళందరూ ఒక్కొక్కరే వచ్చారు. సావిత్రమ్మ నుదుట పెట్టిన ఎర్రటి కుంకుమ బొట్టుమీద, బొట్టు మీద బొట్టుపెట్టారు. తడిముఖం మీద కూడా కుంకుమ రాలిపడిపోతోంది. నుదుటి మీద పక్కలకు చెదిరిపోతోంది. ఒంటికి రాసిన పసుపు బట్టల కంటుకుంది. తడిసిన జుట్టును ముడివేసి, ముడిలో తురుముతున్న మల్లెపూలూ, చామంతులూ, కనకాంబరాలూ కిందికి రాలేవి రాలుతూనే ఉన్నాయి. కొప్పులో నిలిచినవి నిలుస్తూనే ఉన్నాయి. తొడిగిన అయిదు పది మట్టిగాజులు, చేతుల నిండుగా కనిపిస్తున్నాయి.

స్నానం చేయించిన నీళ్ళ మురికి మధ్య సావిత్రమ్మ రూపమిచ్చిన ముత్తయిదువైంది.

పట్టపగలు.

నట్టనడివీధి...

"చూడండర్రా. కావలసిన వాళ్ళంతా చూడండి. మల్లెప్పుడు చూస్తాం, సావిత్రమ్మ మొగాన్ని, ఈ రకంగా. మొగం చూడండి."

"తోడబుట్టిన వాళ్ళను రమ్మనండి."

"వాళ్ళు తప్పక చూడాలి. రమ్మనండి... రమ్మనండి."

పిలుపులో, ఆజ్ఞలో, హెచ్చరికలో, వాటిని పాటిస్తూనే ఉన్నారు.

'ఏం చూడాల? చూసినాంగదా, రోజూ చూసేదే గదా?' భార్గవికి దిక్కుతోచలేదు.

సావిత్రమ్మ రక్తం పంచుకున్న ఆడబిడ్డలు, తల్లి ఎదుట దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోయారు. అమ్మతో పాటుగా, భార్గవికి కన్నీళ్ళు పొంగుకొచ్చాయి.

పుట్టింటి మమకారాలు. కళ్ళు చెమర్చాయి.

"ఎంతసేపు అట్లా బాధపెడతారు, చేసేది చెయ్యబోతూ?" సావిత్రమ్మ పుట్టింటి కుర్రవాడెవరో అసహనంగా అన్నాడు.

"తొందరగా కానివ్వండి. వీళ్ళ ఏడ్పులకు పిల్లలు జడుసుకుంటారు."

'ఇంక ఆడవాళ్ళ పని మొదలుపెట్టండ్రా' అని చెప్పిపోయిన పెద్దాయన హెచ్చరిక చేశాడు.

"సరేలే. మేము ముందు చస్తే బాగుండు. అన్నీ పడేది మేము" అంది పిచ్చమ్మవ్వ.

ఆ పడేదేమిటో భార్గవికి ఏ మూలో తెలిసివస్తోంది.

"సావిత్రమ్మ పెద్దకొడుకెక్కడ?"

"స్నానం చేసినాడా?"

"చాకల్ని తీసుకొని ముందుగా రేవుకు వెళ్ళమనండి."

"ఆ జమ్మిచెట్టు కింద పూజా అదీ చేసి విస్తర పెట్టించండి."

"చేయించినవన్నీ విస్తర్లో పెట్టించండి. అన్నం, పరమాన్నం, పప్పు, కూరలూ, కోడికూర, కోడిగుడ్డు.... ఏదీ మరచిపోవద్దు. అన్నీ రామిరెడ్డికిష్టమైనవి. ఆత్మ తృప్తిపడుతుంది.

"అన్నీ చూసుకున్నాంలే."

"అక్కడ సావిత్రమ్మ స్నానం చేయడానికి నీళ్ళు పెట్టినారా?"

"ఆఁ"

"చీర మార్చుకోవాల గదా? పుట్టింటివాళ్ళు తెచ్చిన తెల్లచీరనూ, తెల్ల రవికనూ చాకలితో పంపినారా?"

"ఆఁ"

"టెంకాయ."

"అన్నీ."

రకరకాల గొంతులు, ఆదేశాలు, సమాధానాలు.

సావిత్రమ్మ రేవు ప్రయాణం మొదలైంది. ఊళ్ళోని మూడు వీధుల ద్వారా ఆమె ప్రయాణం సాగింది. సావిత్రమ్మ వెంట, చూడవచ్చిన ఇల్లాళ్ళూ, సాంగెం నడిపించే వితంతువులందరూ ఉన్నారు. వెంట వచ్చిన పిల్లల్ని వారించలేకపోయారు. సావిత్రమ్మ నిండు ముత్తయిదువ రూపాన్ని, చూడవలిసిన బంధువులింకా ఉన్నారేమోనని ప్రతి ఇంటిముందూ సావిత్రమ్మను కొద్ది క్షణాలు నిలబెట్టారు. వాళ్ళ చేతుల్లో సావిత్రమ్మ ఒక తోలుబొమ్మగా మారింది.

రేవు దగ్గర నట్టనడివీధిలో లాగానే చుట్టూ చుట్టుకున్న స్త్రీలమధ్య స్నానమైంది. కట్టుమారింది. సావిత్రమ్మకు ఇష్టమైన కాఫీరంగంచు కనకాంబరం రంగు చీర–పుట్టింటివాళ్ళు తెచ్చిన చీర–మారింది. వాళ్ళే తెచ్చిన తెల్లచీర వచ్చింది. చేతులు వెనుకకు పెట్టుకోమని వాటిని పట్టుకొని, వెనక్కు చూడవద్దంటూ, పిచ్చమ్మవ్వ సావిత్రమ్మ గాజులు పగలగొట్టింది. మరొక వితంతువు సిగపూలు తీసిపారేసి, కుంకుమ చెరిపింది, పుస్తె తెంచింది.

సావిత్రమ్మ గింజుకొని, వెర్రి ఆవేశంలో పందు వితంతువులను తప్పించుకొని పిండదానం చెయ్యడానికి వచ్చిన పెద్ద కొడుకుని కావలించుకొని బోరుబోరున విలపించింది.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిలిపోయిన సావిత్రమ్మ జేజిని చూసి భయంతో భార్గవి వెక్కిళ్ళు పెట్టి ఏడ్వసాగింది.

"పిల్లలు ఇట్లాంటిచోటికి రాకుంటే బాగుండు... చూడండి ఆ పాప!"

"సావిత్రమ్మ మనుమరాలు."

"బెదిరిపోయింది."

"నేనూ ఆ వయసులో అంతే. ఆడపుట్టుక. చూస్తేనే మంచిది. ఎవరి రాత ఎట్లాగుంటుందో?"

ఏం దిష్టి తగులుతుందోనని తల్లి భార్గవిని గట్టిగా పొదివి పట్టుకుంది.

ఓదార్చటానికి భార్గవి చిన్నమ్మా, పెద్దమ్మా, అవ్వా ప్రయత్నించారు. ఇంటికి చేరే దాకా భార్గవి మౌనంగా దుఃఖిస్తూనే ఉంది.

బ్రాహ్మణోక్తంగా రామిరెడ్డి పెద్దదినం పూర్తి అయింది. ఇంట్లో అవతలి భాగంలోనూ, అవతలి మరొక భాగంలోనూ, వసారాలో, ఇవతలా అందరి మీదా బ్రామ్మణయ్య పూజ చేసిన నీళ్ళు చిలకరించాడు. శుద్ధి పూర్తి అయిందనిపించాడు.

ఇంట్లో ఇవతలి భాగంలో నేల మీద బంధు స్త్రీజనం మధ్య సావిత్రమ్మ కూర్చుంది. ఆమెకు రోదించే శక్తి పోయింది. ఆకలవుతోంది.

అవతల భాగంలో దివ్వె ముట్టించారు.

"దివ్వె చూసి పోండర్రా."

"సావిత్రమ్మ మొగం చూసి వెళ్ళండర్రా."

"మన దాయాదులకు ఇక్కడే భోజనం."

"మనకు వరసైన వాళ్ళకు చెప్పండి. వాళ్ళకు వేరేచోట భోజనాలు ఏర్పాటయ్యాయి. అన్నం తిని వెళ్ళమనండి. ఈ కాలంలో పట్టింపులెందుకు? సాయంత్రం రెండు గంటలు దాటింది."

భార్గవికి అప్పుడే ఒళ్ళు వెచ్చబడింది. ఎవరూ సరిగా గమనించలేదు. చీకటి పడేవేళకు భార్గవికి జ్వరం ముంచుకొచ్చింది. సలసలా ఒళ్ళు కాలుతోంది. 'భయపడింది. అంతగా అయితే పొద్దున్నే డాక్టరు దగ్గరకు తీసుకపోవచ్చు' అనుకున్నారు.

భార్గవికి రాత్రి అంతా ఒకటే పలవరింతలు.

"నన్ను జేజి మాదిరి చేయొద్దు... చేయొద్దు... జేజీ! నాయనా! పిచ్చమ్మవ్వా! సుబ్బమ్మ జేజీ! నన్నట్లా చేయొద్దు. మొగునికంటే నేనే ముందు చచ్చిపోతా. అందరూ చచ్చిపోండి. బొట్టు తియ్యకండి. గాజులు పగలగొట్టకండి. పూలు తియ్యకండి. నాకు ముందరి జేజే కావాల. ఈ జేజి వద్దు. వద్దు."

రామిరెడ్డి పెద్ద దివసంనాటి దివ్వె వెలుగుతూనే ఉంది.

తల్లడిల్లిపోతున్న గాయత్రి పెద్దమ్మ, పార్వతమ్మ చిన్నమ్మ, రాజేశ్వరత్త, సరస్వతత్త, లక్ష్మి అత్త, వెంకటమ్మవ్వ, సుబ్బమ్మ జేజి - వీళ్ళందరి భయాందోళనల మధ్య భార్గవి మంచంలో పలవరిస్తూనే ఉంది. భార్గవి నుదుటి మీద తడిగుడ్డను ఆరిపోకుండా చన్నీళ్ళతో తడుపుతూ, భార్గవి ముఖంలోకే చూస్తూ సావిత్రమ్మ...

● *ఇండియాటుడే, 6 అక్టోబరు 1998.* ●